www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 నవంబర్ 2023

5

కాకినాడ

గెస్ట్ ఫ్యాకల్టీ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-కాకినాడ

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న గెస్ట్‌ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తమ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇల్మిత్రతో కలిసి ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. అర్హత ప్రాతిపదికన ఎంపికైన 10 మంది కి కౌన్సిలింగ్ నిర్వహించి జిల్లాలోని కెజిబివిల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల్లో నియమిస్తూ ఉత్తర్వులు అందజేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి, డిఇఒ జి.నాగమణి, జెసిడిఒ పి.ఉమామహేశ్వరి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కనిపించని జగనన్న 'పాలవెల్లువ'

- నత్తనడకన కేంద్రాల నిర్మాణాలు
- నిధుల విడుదల్లో జాప్యం
- పాడి రైతుల ఎదురు చూపులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సహకార రంగంలో పాల డెయిరీలను బలోపేతం చేసే లక్ష్యంతో, పాడి రైతులను మరింత ప్రోత్సాహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ-అమూల్ ప్రాజెక్టును తీసుకొచ్చింది. 2020 డిసెంబరులో ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. అయితే నేటికీ అనేక చోట్ల పాల కేంద్రాల నిర్మాణం చేపట్టలేదు. నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో అరకొరగా లక్ష్యం నిర్దేశిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకో వైపు పాడి రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దాంతో అనేకమంది పాల ఉత్పత్తికి వెనుకడుగు వేస్తున్నారు.

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పాల సేకరణ కేంద్రాల నిర్మాణం చేపట్టింది. తొలి విడతలో బల్క్ మిల్క్ కలెక్షన్ (బిఎంసి) 200 యూనిట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా 96 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. వీటిలో కేవలం కాకినాడ రూరల్ నేమాం, గంగనాపల్లి, సామర్లకోట మండలం పనసపాడులలో మాత్రమే మూడు చోట్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నప్పటికీ ప్రారంభం కాలేదు. 104 కేంద్రాలు నేటికీ మొదలు కాలేదు. ఒక్కో భవనానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పినప్పటికీ అనేకచోట్ల స్థలాల సమస్య వలన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. మరోవైపు కొన్నిచోట్ల స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం కారణంగా వీటిని నిర్మించలేకపోతున్నారు. పథకాన్ని ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా ఒక్క భవనం కూడా పూర్తి కాకపోవడంతో పాడి రైతులు నిరాశగా ఉన్నారు.

ఇంకా ప్రారంభంకాని నేమాంలో జగనన్న పాలవెల్లువ కేంద్రం

లక్ష్యానికి దూరం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన అనేక పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 4 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి ప్రతిరోజు జరుగుతుంది. అయితే అమూల్ సంస్థతో కుదిరిన ఒప్పందం మేరకు పాల సేకరణ జరగాల్సి ఉంది. అమూల్ ద్వారా జిల్లాలో సుమారు 50 వేల లీటర్ల పాల సేకరణ జరగాల్సిన ఉండగా అధికారులు కేవలం 15 వేల లీటర్లు మాత్రమే లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రస్తుతం తొలి విడతలో 8 మండలాల్లో 12,500 లీటర్లు మాత్రమే పాలు సేకరిస్తున్నారు. భవన నిర్మాణాలు జరగకపోవడంతో రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ భవనాల్లో సేకరిస్తున్నారు.

బ్యాంకర్ల నిర్లక్ష్యం

జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా లబ్ధిదారులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు జారీ చేయించి, వారి వ్యాపారానికి అవసరమైన రుణాలు మంజూరు చేయించాలని జిల్లా అధికారులు పదే పదే ఆదేశిస్తున్నా బ్యాంకర్లు పట్టించుకోవడం లేదు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించినా భారత చేయడం లేదు. జగనన్న పాల వెల్లువ- అమూల్ ప్రాజెక్టు కింద పాలు పోస్తున్న మహిళా పాల ఉత్పత్తిదారులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా బ్యాంకర్లు కృషి చేయాలని ఈనెల 1న మరోసారి నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కానీ బ్యాంకర్లు ముందుకు రావడం లేదు. ఒక్కో పాడి రైతుకి రూ. 35 వేలు 7 శాతం వడ్డీతో ఇవ్వాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 12,500 మంది రైతులు అమూల్ సంస్థకు పాలు పోసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రస్తుతం 3,500 మంది రైతులు పాలు పోస్తున్నారు. వీరిలో డిసిసిబి ద్వారా కేవలం 536 మందికి మాత్రమే రుణాలు అందించారు. ఇతర బ్యాంకులు ఇంకా వేలాది మందికి రుణాలు ఇవ్వాల్సి ఉంది. కానీ సహకారం అందించటం లేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం

జగనన్న పాల వెల్లువ ద్వారా 15 వేల లీటర్లు సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఇప్పటికే 12,500 లీటర్లు సేకరిస్తున్నాం. త్వరలో భవనాల నిర్మాణాలు పూర్తవుతాయి. అయితే పాడి రైతులకు రుణాలు ఇవ్వడం కోసం రుణమేళాలను నిర్వహిస్తున్నాం. బ్యాంకర్లు సహకరిస్తే లక్ష్యాన్ని చేరుకుంటాం.

-సూర్యప్రకాశరావు, పశు సంవర్ధక శాఖ జెడి

పాలస్తీనాకు భారత ప్రభుత్వం అండగా నిలవాలి

- కాకినాడ అఖిలపక్షం డిమాండ్
- పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా 10న కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-కాకినాడ

భారత ప్రభుత్వం పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడాలని కాకినాడ అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జి అధ్యక్షతన సిఐటియు కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బోడకొండ, ఎఐటి యుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టియుసి ఏపి అండ్ తెలంగాణ ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జల్లూరి వెంకటేశ్వరరావు, టిఎన్‌టి యుసి జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబు, ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమల శెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు పప్పు ఆదినారాయణ, పౌరసంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు రాయుడు మోజెస్ మాట్లాడుతూ మణిపూర్ మారణకాండలో బాధితుల తరుపున ఉద్యమించడంలో నేడు ఇజ్రాయెల్ యుద్ధంలో పాలస్తీనా ప్రజలపట్ల సంఘీభావాన్ని ప్రకటించడంలో కాకినాడ జిల్లా అఖిలపక్షం ఎల్లప్పుడూ బాధితుల పక్షాన నిలబడుతుందన్నారు. ఇజ్రాయిల్ నెతన్యాహు ప్రభుత్వం ఒపెన్ ఎయిర్ జైలు వంటి గాజా ప్రాంత ప్రజానీకానికి మంచినీరు, విద్యుత్తు, ఆహార సరఫరా నిలిపివేసి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో 120 దేశాలు తక్షణం యుద్ధ విరమణ పాటించాలని తీర్మానం ప్రవేశపెడితే భారత ప్రభుత్వం గైర్హాజరు కావడం ద్వారా ద్వంద ప్రమాణాలు మోడీ ప్రభుత్వం పాటిస్తున్నారు. ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణకాండలో ఇప్పటివరకు 4500 మంది పాలస్తీనా చిన్నారులు, 2500 మంది మహిళలు, వేలాదిమంది పౌరులు మరణించారు. 1947లో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మేరకు పాలస్తీనా ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారమని సూచించారు. బాధితులైన పాలస్తీనా ప్రజలకు సంఘీ భావంగా 10న సాయంత్రం 6 గంటలకు అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ

సైన్స్ తోనే సమాజాభివద్ధి సాధ్యమనిపాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు జి. నాగమణి అన్నారు. ఎపి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ, కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్, రోటరీ క్లబ్ కాకినాడ, బ్లడ్ క్రాస్ సోమయాటి సంయుక్త ఆధ్వర్యం లో స్థానిక ఎమ్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల నందు రెండు రోజుల పాటు నిర్వహించు జిల్లా స్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ గురువారం ప్రారంభమైనది. ముఖ్య అతిథి గా విచ్చేసిన జి. నాగమణి మాట్లడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్ఎస్ఎన్ ఛారిటిస్ ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎమ్ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థుల శాస్త్రీయ, సాంకేతిక, సామాజిక విషయాల గురించి అవగాహన కొరకు సైన్స్ కాంగ్రెస్ సహకరిస్తుందన్నారు. రోటరీ క్లబ్ కాకినాడ అధ్యక్షులు గోపి కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు జి.నాగమణి

'ప్రతిభ' పాఠశాల్లో చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

లయన్స్ క్లబ్, ఆధ్వర్యంలో ప్రతిభ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ ఎస్‌వివిజి. ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిత్రలేఖనం ద్వారా సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ పెంపొందిం చవచ్చన్నారు. ఇంత మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల సెక్రటరీ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ గౌరి, లయన్స్ క్లబ్ నాయకులు గుండు శంకరరావు, మేక శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొనివిద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణభేరి యాత్ర గురువారం మండల పరిధిలోని ఆర్‌బి.కొత్తూరు, ఆర్‌బి.పట్నం, చిన్న బ్రహ్మదేవం, కొండపల్లి, కె.కొత్తూరు, ఆనూరు, ఆనూరు కొత్తూరు, వాలుతిమ్మాపురం, జె.తిమ్మాపురం, కట్టమూరు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నవంబర్ 15 న జరిగే చలో విజయవాడను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి ఊడిగం చేస్తున్నాయన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపికి వంత పాడుతున్నాయన్నారు. పోరాటాల ద్వారానే రాష్ట్ర హక్కులను సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.కష్ణ, డి.సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య, గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సూరిబాబు

'నల్ల బూడిద' సమస్య పరిష్కారానికి సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-పెద్దాపురం

పట్టణ పరిధిలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న నల్ల బూడిద వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నందున, ఈ సమస్య పరిష్కారానికి పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ప్రజలు ఈ సమస్యతో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రజా ఉద్యమాల ఫలితంగా అధికారులు కంటి తుడుపు చర్యలు తీసుకోవటం తప్ప శాశ్వత పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. ఇటీవల కాలంలో మళ్ళీ ఈ సమస్య పునరావృతమై తీవ్రతరం అయ్యిందన్నారు. ఈ నల్ల బూడిద కళ్ళల్లో పడి ప్రజలు కంటి జబ్బులతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. రహదారిలో వాహనాలపై వెళ్లే వారి కళ్ళల్లో ఈ బూడిద పడి తీవ్ర అవస్థలకు గురవుతు న్నారన్నారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, కేదారి నాగు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్ఎన్‌సి'ల్లో ఉద్యోగాలకు జెఎన్‌టియుకె విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి కాకినాడ

జెఎన్ యుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) లో సిఎస్ఇ, ఇసిఇ విభాగాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న నలుగురు విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో(ఎమ్ ఎన్‌సిలు) కొలువులు సాధించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు గురు వారం తెలిపారు. సిఎస్ఇ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న మన్యం శ్రీదేవి, ఇసిఇ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న బోడపాటి శ్రీనివాస్‌లకు కావ్వాల్ట్ కంపెనీకి రూ.35లక్షల వార్షిక వేతనంతో, అదేవిధంగా సిఎస్ఈ విభాగంలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మార్ని యశ్వంత్, అల్లాడి సంధ్యలు డార్విన్బాక్స్ కంపెనీకి రూ.16.30లక్షల వార్షిక వేతనంలో ఎంపికయ్యారన్నారు. జెఎన్ యుకె విద్యార్థులు బహుళజాతి సంస్థల్లో కొలువులు సాధించేలా అన్ని విధాలా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్ తెలిపారు. యుసిఇకె ట్రైనింగ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా. అరవ కరుణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్యాంపస్ రిక్రూట్మెంట్ విధానాలు పూర్తిగా మారిపోయాయని, దానికి అనుగుణంగా విద్యార్థులకు కోడింగ్, తదితర అంశాలపై పూర్తిగా అవగాహన కలిగించేలా శిక్షణ అందిస్తున్నామన్నారు.

బోడపాటి శ్రీనివాస్

మన్యం శ్రీదేవి

మార్ని యశ్వంత్

అల్లాడి సంధ్య

గౌరవవేతనం కోసం పాత్రికేయుల వినతి

ప్రజాశక్తి-గండేపల్లి

పాత్రికేయులకు సరైన ఆర్థిక భరోసా లేదని వారి జీవనోపాధికి తోడ్పాటును అందించే విధంగా గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని మంత్రి ఆర్‌కె.రోజాకు వినతి పత్రం అందించారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సూరంపాలెంలో మంత్రి ఆర్‌కె.రోజాకు దుశ్శాలువా కప్పి జర్నలిస్టులు ఘనంగా సత్కరించారు.

కేబినెట్ నిర్ణయం హర్షం

సామర్లకోట రూరల్ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై పాత్రికేయులు హర్షం వ్యక్తంచేశారు. గురువారం సామర్లకోట ప్రసన్నాంజనేయ నగర్ వైసిపి కార్యాలయం వద్ద పెద్దాపురం నియోజకవర్గ జర్నలిస్టులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మన్ పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ దవులూరి దొరబాబును జర్నలిస్టులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం నియోజవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేస్తున్న జగన్

ప్రజాశక్తి-యంత్రాంగం

మోసపూరిత జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులను సిఎం జగన్ దగా చేస్తున్నారని తెలుగు యువత విమర్శించారు. నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న జగన్ వైఖరిపై తెలుగు యువత ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు.

కాకినాడ మోస పూర్తి వాగ్దానాలతో మాయమాటలతో యువతను నమ్మబలికి అధికారంలోకి వచ్చిన జగన్ మోసపూరిత జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులను దగా చేస్తున్నాడని కాకినాడ సిటీ నియోజకవర్గ తెలుగు యువత విమర్శించారు. జగన్ నిరంకుశ వైఖరికి నిరసనగా కాకినాడ సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో బుధవారం నగర తెలుగు యువత ఇంద్రపాలెం అంబేద్కర్ కూడలి నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లులు అర్పించారు. అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు వనమాడి మోహన వర్మ, తెలుగు యువత అధ్యక్షులు చింతలపూడి రవి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు సంవత్సరాల కాలంగా మోస పూర్తి జాబు కాలండర్ తో కాలం వెల్లదీస్తున్నాడన్నారు. రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శులు గాది శివ రామకష్ణ, తేజ్ యాదవ్, తెలుగు యువత నాయకులు కసింకోట చంద్రశేఖర్, పిన్నమ్మరెడ్డి బుజ్జి, పాలిక సూర్య, క్రరీ నరసింహా మూర్తి, తదితరులు పాల్గొన్నారు. **రౌతులపూడి** నిరుద్యోగుల కు ఉద్యోగాలు కల్పించకుండా సిఎం జగన్ మోసపూరిత జాబ్ కేలండర్ తో కాలం గడిపారని నాయకులు విమర్శించారు గురువారం రౌతులపూడిలో నిరసన తెలియజేశారు. ప్రతి సంవత్సరం డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేటికి భర్తీ చేయలేదన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వేరే రాష్ట్రానికి తరలిపోవడం నూతనంగా రాష్ట్రానికి పరిశ్రమల పెద్దగా రాకపోవడం వంటి పరిస్థితులతో రాష్ట్రంలో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు పైల వేణు. గవిరెడ్డి గుర్నాథ్. కొరుప్రోలు ధనకేశవరావు వాసు తదితరులు ఉన్నారు. **తాళ్ళరేవు** రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోసపూరిత నోటిఫికేషన్ లు, జాబ్ క్యాలెండర్ లు ప్రకటించి నిరుద్యోగులను మోసం చేస్తుందని రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో తాళ్ళరేవు లో గురువారం తహశీల్దార్ కార్యాలయం సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న ముమ్మిడివరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో మోసపోయిన యువతతో మండల స్థాయిలో ఆందోళన చేసామని, 11న పార్లమెంటు స్థాయిలో తరువాత రాష్ట్ర స్థాయిలో ధర్నాలు చేస్తామన్నారు. ఎస్‌సి సెల్ నాయకుడు జక్కల ప్రసాద్ బాబు, యువకులు ప్రవీణ్, అఖిల్, అనిల్, రమణ, శివభాస్కర్, సందీప్, గౌతం, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు యువత

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

సత్వర కేసుల పరిష్కారం కోసం ప్రతి నెలా నిర్వహించే లోక్ అదాలత్ లను కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార చట్టం ఏర్పడిన రోజు సందర్భంగా గురువారం స్థానిక కోర్టు హాలులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ మాట్లాడుతూ మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. ఈ సదస్సులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు సోమశేఖర్, న్యాయవాదులు మడికి రాంబాబు, అత్తిలి ప్రభూజి, విశాలాక్షి, విజయలక్ష్మి, రాగం కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం** కోర్టులో పెండింగ్ కేసుల పరిష్కార వేదిక లోక్ అదాలత్ అని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి అన్నారు. గురువారం పిఠాపురం కోర్టుల ఆవరణలో జరిగిన న్యాయ సేవా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరంచట్టాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగా రాజారావు, జిల్లా కోర్టులు ఎపిపి ఎకెవై.రెడ్డి, ఎజిపి శాఖ నాగేశ్వరరావు, ఎస్ఎం.ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దాపురం

రైతు భరోసా కేంద్రం సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం పిడి హరిబాబు అన్నారు. స్థానిక పాండవుల మెట్ట పై ఉన్న జిల్లా వనరుల కేంద్రంలో పెద్దాపురం వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని కిర్లంపూడి, పెద్దాపురం మండలాల రైతు భరోసా కేంద్రం సిబ్బందికి గురువారం ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

మండలంలోని రాజపూడి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం2 గంటల వరకు విద్యుత్ కు అంతరాయం ఏర్పడనుందని ఎఇ రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాజపూడి సబ్ స్టేషన్, 11 కెవి ఫీడర్ నందు చెట్లు నరికివేత, మరమ్మతుల వల్ల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు.

కార్టూ'నిజం'

మనం బిజెపికి తాకట్టు పెడుతున్నాం కద్సార్..!!

పలుచోట్ల 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొని సిఎం జగన్ ఎపికి నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించారు. వివరాలు ఇవి..

కాకినాడ నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన సిఎం వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి వస్తేనే పేద ప్రజలు సుఖసంతోషాలతో ఉండగలరని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 18ఎ సచివాలయ పరిధిలోని తూరంగిపేటలో గురువారం రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ ద్వారంపూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డివిజన్ పరిధిలో అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ప్రచార బోర్డును ఎంఎల్ఎ ద్వారంపూడి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌడ మాజీ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎఎంసి ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, స్థానిక నాయకులు ధోని చిట్టిబాబు, తదితరులు హాజరయ్యారు. **రౌతులపూడి** ఎపి అభివృద్ధి సిఎం జగన్‌తో సాధ్యమని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యుడు గొల్లు లక్ష్మణమూర్తి అన్నారు. వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమంలో భాగంగా మండల గ్రామమైన ఎస్.అగ్రహారంలో గురువారం పర్యటించారు గ్రామంలోని పలు నివాసాలకు వెళ్లి నాలుగున్నర సంవత్సరంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జిగిరెడ్డి శ్రీను, సర్పంచ్ సర్ణం శ్రీనివాస్, ఎంపిటిసి కొల్లు పల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** అభివద్ధి,సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు మళ్ళీ జగనే రావాలి అని సామర్లకోట ఎం.పి.పి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణా కష్ణమూర్తి తదితర వక్తలు పేర్కొన్నారు. వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాలను గురువారం సామర్లకోట మండలం నవర గ్రామ సచివాలయం నందు, సామర్లకోట బ్రౌన్ పేట సచివాలయం వద్ద కార్యక్రమాలు నిర్వహించారు. సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ పాల్గొని సిఎం జగన్ అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని వాలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో లో ఎంపిడిఒ డి.శ్రీలలిత, పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నేతల తదితరులు పాల్గొన్నారు. **కరప** మండలం అరట్లకట్ట గ్రామపంచాయతీలో సర్పంచ్ గోపి సత్యవేణి అధ్యక్షతన జరిగిన వై ఎపినీడ్స్ జగన్ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు పెంకె శ్రీలక్ష్మి సత్తిబాబు, జెడ్‌పిటిసి సభ్యుడు వై.సుబ్బారావు పాల్గొని డిస్ప్లే బోర్డులను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాబోయే 7 రోజుల పాటు ప్రతి వాలంటీర్ తన క్లస్టర్ పరిధిలో ప్రతిరోజూ 10 కుటుంబాలను కలిసి ప్రభుత్వం ఇచ్చిన 'ఆంధ్ర ప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే' అనే బుక్ లెట్ అందజేయాలని అన్నారు. పంచాయతీ విస్తరణ అధికారి సలాది శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వి సునీల్ కుమార్, మండల కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, అరట్లగట్ట గ్రామ అధ్యక్షుడు చోడగం సూరిబాబు, గొడ్డటిపాలెం గ్రామ సర్పంచ్ వి శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం ఇంజరం పంచాయతీ పరిధిలోనీ లబ్ధిదారులకు ప్రత్యక్ష బదిలీ ద్వారా రూ. 21,8, 59, 310లు లబ్ధి చేకూరిందని ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ అన్నారు. ఇంజరం సర్పంచ్ ముద్దన శివరామ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ పథకాలను ఎంపిడిఒ ఎం.అనుపమ చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. మధ్య దళారులు లేకుండా అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంటు లోకి నగదు బదిలీ చేశారని, అధికారంలోకి వచ్చిన మరుక్షణమే హామీలను అమలు చేసినందుకు జగనన్నను మళ్లీ సిఎం చేయాలని ముమ్మిడివరం ఎఎంసి. ఛైర్మన్ కుడుపూడి శివనారాయణ అన్నారు. అనంతరం వైసిపి జెండాను గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల వైసిపి అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్, సచివాలయాల కన్వీనర్ దున్న శ్రీకాంత్, పెయ్యల కొండబాబు, కోరుకొండ చంటి, వైస్ ఎంపిపి ధూళి పూడి నాగేంద్ర ప్రసాద్, కె.నాగరాజు, వ్యవసాయ శాఖ రిటైర్డ్ జెడి పెట్ల సూర్యనారాయణ రాజు, ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు, దవులూరి శ్రీరామ్మూరి తదితరులు పాల్గొన్నారు..

ఎస్ అగ్రహారం గ్రామంలో వైసిపి జెండా ఎగరవేస్తున్న నేతలు

ఇంజరం సభలో మాట్లాడుతున్న ఎంపిపి రాయుడు సునీత

నేరాలు ఘోరాలు

సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో పలుచోట్ల సారాను విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాంపాలెం గ్రామానికి చెందిన గారపాటి శ్రీను నాటు సారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని, అతని నుంచి 10 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గోపాలపురం పెద్దగూడెంలో సారాను విక్రయిస్తున్న కోరిపల్లి రమణను అరెస్టు చేసి, ఆమె నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కొవ్వూరు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - వాగ్లలు

వివాహిత అదృశ్యంపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలం ఊనగట్లకు చెందిన కేత పాటేశ్వరరావు, దుర్గాదేవి భార్యాభర్తలు. ఎక్కువగా ఫోన్లు మాట్లాడుతూ కుమార్తెను పట్టించుకోకపోవడంతో పాటేశ్వరరావు సెప్టెంబర్ 13న భార్య దుర్గాదేవిని మందలించాడు. దీంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో పాటేశ్వరరావు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ తెలిపారు

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ రామన్నపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు అరదాడి లక్ష్మణరావు(56) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడని కోరంగి పోలీసులు తెలిపారు. ఈనెల 8న లక్ష్మణరావు చేపలవేటకు వెళ్లాడు. గురువారం రామన్న పాలెం వద్ద ఆత్రేయ పాయలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. లక్ష్మణరావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఎఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రావెల్ వాహనాల అడ్డగింత

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురంలో గురువారం అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ వాహనాలను వైసిపి నాయకులు బచ్చల రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు అక్రమంగా లారీలతో గ్రావెల్ తరలించుకు పోతున్నారన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సామర్లకోటలో విద్యార్థి కిడ్నాప్ కలకలం

- రూ. 4 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు
- కాకినాడలో వదిలిపెట్టిన ఆగంతకులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో బాలుని కిడ్నాప్ కలకలాన్ని సృష్టించింది. బాలుడ్ని కిడ్నాప్ చేసిన ఆగంతకులు రూ.4లక్షలు డిమాండ్ చేశారు. పోలీసులు గాలింపు చేపట్టడంతో కాకినాడలో బాలుడ్ని వదిలి పరారయ్యారు. పోలీసులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు బలుసుల పేటకు చెందిన తాడి రమేష్, మరియ భార్యాభర్తలు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు తాడి దుర్గానాని స్థానిక నీలమ్మచెరువు వద్దగల ఎస్‌టిబిఆర్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే గురువారం కుమారుడిని పాఠశాలకు పంపించారు. అనంతరం వారు శీలంపాకలో బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వెళ్లారు. ఇదిలా ఉండగా దుర్గానాని పాఠశాల తరగతి గదిలోకి ఉదయం 11:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి వచ్చాడు. దుర్గా నాని అమ్మమ్మకు ఆరోగ్యం బాలేదని, విద్యార్థిని తీసుకెళ్తున్నానని, తాను వారి బంధువునని ఉపాధ్యాయులకు నమ్మబలికాడు. విద్యార్థి సైతం అతని మాటలను నమ్మడంతో ఉపాధ్యాయులు వచ్చిన వ్యక్తి నుంచి సంతకం తీసుకొని దుర్గా నానిని అతనితో పంపించారు. అనంతరం 4 గంటల సమయంలో ఆగంతకులు విద్యార్థి తండ్రి రమేష్‌కు ఫోన్ చేసి రూ.4లక్షలు డిమాండ్ చేశారు. దీంతో శీలంకలో ఉన్న రమేష్ తన భార్యతో కలిసి హుటాహుటిన సామర్లకోటలో ఇంటికి చేరుకున్నారు. స్థానిక కౌన్సిలర్ నేతల హరిబాబు, 7వ సచివాలయ కన్వీనర్ నేతల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాపర్లు చేసిన ఫోన్ నెంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లోని సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. పాఠశాలలో ఉండగా విద్యార్థి ఎలా కిడ్నాప్ అయ్యాడనే కోణంలో విచారిస్తున్నారు.

కాకినాడలో విద్యార్థి ప్రత్యక్షం

కిడ్నాప్‌నకు గురైన విద్యార్థి దుర్గానాని రాత్రి 7 గంటల ప్రాంతంలో కాకినాడలో ప్రత్యక్షమయ్యాడు. విద్యార్థి కిడ్నాప్‌పై మీడియా, సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేయడంతో పాటు పోలీసులు అప్రమత్తం కావడంతో కిడ్నాపర్లు విద్యార్థిని కాకినాడ జెఎన్‌టియుకె వద్ద వదిలిపెట్టారు. విద్యార్థి దుర్గానానిని సామర్లకోట మఠం సెంటర్లో దింపాలని 'ర్యాపిడో' సంస్థకు చెందిన టూవీలర్ డ్రైవింగ్ ఒక ద్విచక్ర వాహనాన్ని మాట్లాడి, అతనికి డబ్బులు చెల్లించి జెఎన్‌టియుకె వద్దకు పంపించారు. ర్యాపిడో సంస్థ ప్రతినిధి బాలుని మోటార్ సైకిల్ ఎక్కించుకొని మఠం సెంటర్లో కాక విద్యార్థి చిరునామాలు తెలుసుకుని బలుసుల పేటలో ఇంటికి తీసుకొచ్చి అప్పగించారు. ఈ విషయాన్ని బాలుని తల్లిదండ్రులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి సామర్లకోట స్టేషన్‌కు వచ్చి విద్యార్థి నుంచి వివరాలు సేకరించారు. ర్యాపిడో ప్రతినిధి వచ్చిన ఫోన్ నెంబర్ ఆధారంగా కిడ్నాపర్లను గుర్తించే చర్యలు చేపడుతున్నట్లు డిఎస్‌పి తెలిపారు. కాకినాడలోని కోకిల రెస్టారెంట్‌లో విద్యార్థిని భోజనం తీసుకున్నట్లు తెలియడంతో కోకిల రెస్టారెంట్ వద్ద సిసి పుటేజీను పరిశీలిస్తున్నారు. కిడ్నాపర్లను గుర్తించే చర్యలు ముమ్మరం చేస్తున్నట్లు ఆమె చెప్పారు. విద్యార్థిని క్షేమంగా అప్పగించిన ర్యాపిడో సంస్థ ప్రతినిధిని, చాకచక్యంగా వ్యవహరించిన మీడియా ప్రతినిధులను, స్థానిక ఎసిఐ సతీష్ బృందాన్ని డిఎస్‌పి అభినందించారు. అనంతరం విద్యార్థి దురా నానిని తల్లిదండ్రులకు అప్పగించారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి లతాకుమారి

యానాం వార్తలు

చింతా వెంకన్నకు అభినందన

ప్రజాశక్తి - యానాం

గోవాలో జాతీయ అథ్లెటిక్స్-2023 పోటీలకు పుదుచ్చేరి తరపున టెక్నికల్ (రిఫరీ) అఫీషియల్‌గా వ్యవహరించిన శారదా ఎయిడెడ్ హైస్కూల్ పీఈటీ చింతా వెంకన్నను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్లో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి

ప్రజాశక్తి - యానాం

శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ మార్గంలో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ ఏ ఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరిబ్ ప్రగాఢ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, ఎస్సై కట్టా సుబ్బరాజు, కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతా వెంకన్నకు అభినందన

ప్రజాశక్తి - యానాం

గోవాలో జాతీయ అథ్లెటిక్స్-2023 పోటీలకు పుదుచ్చేరి తరపున టెక్నికల్ (రిఫరీ) అఫీషియల్‌గా వ్యవహరించిన శారదా ఎయిడెడ్ హైస్కూల్ పీఈటీ చింతా వెంకన్నను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్లో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతిని అందజేశారు.

దిశ యాప్‌పై అవగాహన

కాకినాడ : దిశ యాప్‌పై పోలీసులు మహిళలు, బాలికలు, యువతులకు అవగాహన కల్పించారు. ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ స్వీయ పర్యవేక్షణలో దిశ యాప్ మొబైల్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయించే కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. కాకినాడ, పెద్దాపురం డివిజన్ల పోలీసు స్టేషన్ల పరిధిలోని ముఖ్య కూడళ్లు, విద్యా సంస్థలు, బస్టాప్‌లు, పబ్లిక్ పార్కులు, షాపింగ్ మాల్స్ తదితర ప్రదేశాల్లో ది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దొరబాబు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పిఠాపురం

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించే 67వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టంలోని స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. గెలుపోటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు 11 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు అండర్-17 బాలుర విభాగంలో పోటీలో నిర్వహించారు. విజయనగరం, కర్నూలు మ్యాచ్‌లో విజయనగరం జట్టు, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లా మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు, గుంటూరు, నెల్లూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు, శ్రీకాకుళం, కష్ణా జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ పోటీల్లో తూర్పు గోదావరి ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బివివి.ప్రసాద్, ఆర్గనైజేషన్ కార్యదర్శి కె.మంగమ్మ, హెచ్‌ఎం వివివి.కష్ణ, లంక జార్జి, కె.నూకరాజు, రవి రాజు, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో రాణిస్తే చరిత్రలో నిలుస్తాం...

- పర్యాటక శాఖ మంత్రి రోజా
- ఆదిత్యలో సౌత్ జోన్ ఇంటర్‌యూనివర్సిటీ కబడ్డీ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆటల్లో రాణిస్తే చరిత్రలో నిలిచిపోతామని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా అన్నారు. సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ(పురుషులు) టోర్నమెంట్-2023 గురువారం ప్రారంభమైంది. 12వ తేదీ వరకూ జరిగే ఈ టోర్నీకి ఆరు రాష్ట్రాల్లోని 113 యూనివర్సిటీలకు చెందిన 95 జట్లు హాజరయ్యాయి. జెఎన్‌టియుకె, ఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఆర్‌కె.రోజా హాజరై క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. జెఎన్‌టియుకె విసి జివిఆర్.ప్రసాద్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ యూనివర్సిటీ విసి కె.పద్మరాజు, ఇండియన్ యూనివర్సిటీస్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ బల్జీత్ సింగ్ సేఖోన్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇజ్జపురెడ్డి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మంత్రి రోజా మాట్లాడారు. ప్రో కబడ్డీ స్థాయిలో చేసిన ఏర్పాట్ల పట్ల ఆదిత్య యాజమాన్యాన్ని అభినందించారు. గెలుపోటములు రెండూ మూడక్షరాలే అయినా, గెలుపు ఇచ్చే కిక్ వేరే లెవెల్ అని అన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయిలో రాణించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడలకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. డిసెంబర్‌లో రాష్ట్ర మంతటా ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. అనంతరం బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. స్వయంగా కబడ్డీ ఆడి అలరించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలో క్రికెట్ తరువాత అత్యధిక ప్రాచుర్యం పొందిన క్రీడ కబడ్డీ అన్నారు. ఈ క్రీడ దేశీయ సంస్కృతిలో ఒక భాగం అన్నారు. ఈ క్రీడకు ప్రభుత్వం తరుపున ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. హేమచంద్ర రెడ్డి మాట్లాడుతూ జెఎన్‌టియుకె, ఆదిత్య ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం రోజా చేతుల మీదుగా 'కబడ్డీ' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఆదిత్య యాజమాన్యం తరుపున ఎన్.శృతిరెడ్డి, డాక్టర్ ఎన్.సుగుణరెడ్డి మంతి రోజాను సన్మానించారు.

క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడుతున్న మంత్రి రోజా

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక కొండయ్యపాలెం ఫ్లయ్ ఓవర్‌కు అనుసంధానంగా శారదాదేవి ఆలయం సమీపంలో రూ.1.95 కోట్లతో నిర్మిస్తున్న జంక్షన్ అభివృద్ధి పనులను కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు గురువారం పరిశీలించారు. పనుల ప్రగతిని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఫ్లయ్ ఓవర్‌ను ప్రజలకు అంకితం చేసేందుకు సిఎం జగన్ వచ్చే అవకాశం ఉన్నందున పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు. నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రూ.1.95 కోట్లతో మిలటరీ రోడ్డులోని ఫ్లయ్ ఓవర్ వద్ద రహదారి, కల్వర్టు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడం తదితర అభివృద్ధి పనులు చేస్తున్నట్టు కమిషనర్ చెప్పారు. ఆయన వెంట డిఇ బిహెచ్.సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

ప్రభుత్వానికి తొత్తులుగా పోలీసులు

- ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు
- మళ్లీ అరెస్టు, స్టేషన్‌కు తరలింపు, తీవ్ర ఉద్రిక్తత...

ప్రజాశక్తి-మండపేట

పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో కేశవరంలోని కుర్రవాని మెట్ట క్వారీ తవ్వకాల వివాదం రోజురోజుకూ రాజుకుంటోంది. ఈ తవ్వకాలను పరిశీలించేందుకు వెళ్తున్న ఎంఎల్ఎను మూడు రోజులుగా పోలీసులు అడ్డుకుంటున్నారు. తాజాగా గురువారం ఆయన్ని మరోసారి పోలీసులు అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం నుంచే ఎంఎల్ఎ నివాసానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వీరిని పోలీసులు అక్కడ నుంచి పంపించేశారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి ఎంఎల్ఎ ఇంటి నుంచి బయటకు వచ్చారు. కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడ చేరుకోవడంతో వారందరితో కలిసి కేశవరం వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంటి నుంచి బయటకు వెళ్లే వీలు లేదంటూ హుకుం జారీ చేశారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు ప్రభుత్వానికి పోలీసులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక దశలో ఎంఎల్ఎను తరలిస్తున్న పోలీస్ జీప్‌నకు అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ని మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యకర్తలు పోలీసు వాహనం వెనకనే స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ ముందు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అరెస్టును నిరసిస్తూ ఎంఎల్ఎ వేగుళ్ల మాట్లాడారు. అక్రమ తవ్వకాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీనిపై ఎంతవరకైనా పోరాటం చేస్తామన్నారు. ప్రతిపక్షాలను బూటు కాళ్ల కింద నలిపి తొక్కేయాలని చూడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజలు కేశవరం క్వారీ అక్రమ రవాణాను గమనిస్తున్నారని, దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంఎల్ఎ వేగుళ్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సీతంపేట శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని గ్రంథాలయం అధికారి ఎం.వీరలింగం తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనంపై అవగాహన, డ్రగ్స్ నియంత్రణపై అవగాహనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమ కారుల సంస్మరణ సభ, 17న రచయితల సందేశాలు, సెమినార్లు, కవి సమ్మేళనం, 18న వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, 19న మహిళా దినోత్సవం, మహిళా సాధికారత, దిశ చట్టంపై అవగామన, 20న వారోత్సవాల ముగింపు సభ, ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 9963594601, 9949488341 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
మీరు విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
అయితే దరఖాస్తు పంపండి
దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
విలేకర్లు కావలెను
◆ రాజమండ్రి సిటీ ◆ రాజమండ్రి కార్పొరేషన్ ◆ రాజమండ్రి క్రైం
◆ కోరుకొండ ◆ రంగంపేట ◆ కిర్లంపూడి ◆ కాకినాడ కార్పొరేషన్
◆ కాకినాడ భానుగుడి ◆ పెద్దాపురం రూరల్ ◆ కిర్లంపూడి ◆ తుని
◆ తుని రూరల్ ◆ తొండంగి ◆ ప్రత్తిపాడు ◆ గొల్లప్రోలు
◆ పి.గన్నవరం ◆ ముమ్మిడివరం ◆ అల్లవరం ◆ రాయవరం
◆ కె.గంగవరం ◆ మలికిపురం ◆ సఖినేటిపల్లి ◆ అనపర్తి
◆ నిడదవోలు రూరల్
విలేకర్లకు అర్హత
ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయాలి
prajagodavari@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపిటిసి శీలం భాస్కరరావు దంపతులు రక్షిత మంచి నీటి పథకానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఎల్‌సి మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించి, జగనన్న కాలనీలను లేఅవుట్‌లను తలపించేలా అభివృద్ధి చేసిన ఘనత సిఎం జగన్‌కె దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ సొంతింటి కలను సాకారం చేసిన జగనే మళ్లీ సిఎం అవ్వాలని ఎంఎల్‌సి తోట ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, ఎంపిటిసిలు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైసిపి మండల కన్వీనర్ శీలం గోవిందు, కట్టా మురళీకృష్ణ, అరదాని శ్రీదేవి, పెంటపాటి వెంకన్న బాబు, కె.శ్రీనివాస్, పీతల బంగారం పాల్గొన్నారు.

రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-పెద్దాపురం

రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యం ద్వారానే శెట్టిబలిజల అభివృద్ధి చెందుతారని బిసి ఉద్యమ నాయకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం జె.తిమ్మాపురంలో శెట్టిబలిజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. సామాజిక చైతన్యంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వెనుకబడిన వర్గాల వారు సంఘటితంగా ఉన్నప్పుడే రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. ఈ సదస్సులో శెట్టిబలిజ సంఘం మండల అధ్యక్షులు సిమ్మ గోవిందు, సంఘ కన్వీనర్ పెంకె వెంకటలక్ష్మి, యూత్ అధ్యక్షుడు అనసూరి శ్రీను, చెల్లుబోయిన గోవిందరాజు, బత్తిన సూరిబాబు, వాసంశెట్టి రాజేష్, కె.వెంకటరమణ, కొప్పిశెట్టి చంద్రమౌళి, శ్రీను, పింకే రామకృష్ణ, పోలవరపు వీరనాగేశ్వరరావు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

సర్టిఫికెట్లు పడిపోయినవి

నా పేరు వాసంశెట్టి ఆనంద నాగేంద్ర పవన్, తండ్రి: రాంబాబు, అంబాజీపేట మండలం, గంగలకుర్రు, పెద గరువు, రామాలయం వద్ద, డోర్ నెం. 3-96 లో నివాసముంటున్నాను. ది. 2-11-2023వ తేదీన నా సర్టిఫికెట్లు జిరాక్సు తీయించుకొనేందుకు వెళుతుండగా పడిపోయినవి. దయచేసి దొరికినవారు ఈక్రింద అడ్రసుకు పంప కోరుచున్నాను.

వాసంశెట్టి ఆనంద నాగేంద్ర పవన్
తండ్రి: రాంబాబు
పెద గరువు, రామాలయం వద్ద,
గంగలకుర్రు, అంబాజీపేట మండలం
సెల్: 9573431792

అన్నదానమే మహాదానం : దవులూరి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఆకలితో ఉన్నవారికి పట్టెడు అన్నం పెట్టడం కన్నా మించిన దానం లేదని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర బిసి అయ్యర్క కార్పొరేషన్ చైర్పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. విజయదశమి ఉత్సవాల ముగింపులో భాగంగా సామర్లకోట పాత్రుల వీధిలో అమ్మవారి ఆలయం వద్ద జరిగిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. సుమారు 5వేల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ నాయకులు కమిటీ సభ్యులు పెదరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, వెలిశెట్టి శివాజీ, కె.ఉమామహేశ్వరరావు, కె.రామకష్ణ, వి.త్రినాథ్, డి.రాజేష్ పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి : గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిటిసి సభ్యులు కర్రి వెంకట పద్మావతి, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి సూచించారు. జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో 18 మందికి మంజూరైన గ్యాస్ కనక్షన్లను, స్టౌ, రెగ్యులేటర్లను వారు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు కలిగిన కార్డుదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తారన్నారు. మహిళల పేరున వీటిని అందిస్తారాన్నరు. ఆధార్ కార్డు. తెల్ల రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, రెండు ఫోటోలతో దరఖాస్తు పూర్తి చేసి సచివాలయం కార్యదర్శి ద్వారా గ్యాస్ ఏజెన్సీకి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి దుర్గాప్రసాద్, వైఎస్సార్సీపీ జిల్లా కమిటీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై హర్షం

అంబాజీపేట : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదించడం హర్షణీయమని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు వాతాడ నవీన్ రాజు అన్నారు. అంబాజీపేటలో రాష్ట్ర కోశాధికారి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన పి.గన్నవరం నియోజవర్గ స్థాయి యూనియన్ సమావేశం సోమవారం నిర్వహించారు. నియోజవర్గ అధ్యక్షునిగా డేగల ఏడుకొండలు, గౌరవాధ్యక్షునిగా ఏడిద వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా శృంగవరపు వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ముత్తాబత్తుల నీలకంఠం, మహిపాల నాగరాజు, బోయి రాంబాబు, ట్రెజరర్‌గా బడుగు వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా కోన సత్తిబాబు, టి.రాజా, కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం, ధనరాజ్, ఎం.రాజా, యాండ్ర శ్రీను, జల్లి విక్టర్ కుమార్, విత్తనాల నాగ కిషోర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బంగార్రాజు, జె.రామ్‌ప్రసాద్, దొమ్మేటి సోమేష్, ఎస్.హరి. కె.సూరిబాబు, జె.డి.శ్రీనివాస్, బి.చిన్నారావు, జి.ఏడుకొండలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట : మండలంలోని ఏడిదలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, సీతానగరం సర్పంచ్ వరద చక్రవర్తి, ఎంపిటిసి అడ్డాల శ్రీదేవి రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ములు సకాలంలో రైతుల ఖాతాకు జమ అవుతాయన్నారు. పూర్తి పారదర్శకంగా కొనుగోలు కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు. సిఎం జగన్ రైతు పక్షపాతి అని కొనియాడారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పలివెల సుధాకర్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం.770/2022-ఎ1 ది.04-11-2023

టెండరు కమ్ వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2023-24 సంవత్సరమునకు స్వాధీనము చేసిన నాటి నుండి 31-03-2024 వరకు ఆశీలు వసూలు చేసుకొనే గుత్తహక్కు నిమిత్తం ది. 21-11-2023వ తేది మధ్యాహ్నం గం॥ 1.00 సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. సదరు టెండరు నగరపాలక సంస్థచే ప్రకటించబడిన గజిట్ నోటిఫికేషన్ నెం. 08/2023 లోని రేట్లు మరియు షరతులకు లోబడి దాఖలు చేయవలసియున్నది. టెండర్లు తెరువకుండానే టెండరుదారుల సమక్షమున అదేరోజు సాయంత్రం గం॥ 4.00 లకు కమిషనరు వారు కాని, వారిచే అనుమతి పొందిన అధికారి కాని వేలము నిర్వహించబడును. తదుపరి హాజరైన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. గుత్తదారుడు వేయు టెండర్లు / పాట మొత్తమునకు ఛార్జీలు అదనము మరియు వాటి మొత్తముపై 18% జి.ఎస్.టి. అదనము.

వ. నెం.	మార్కెట్టు పేరు	ధరావత్తు రూ.	బ్యాంకు గ్యారంటీ రెండు సంవత్సరములకు (రూ.)
1	జాంపేట మార్కెట్టు	4,00,000	4,00,000
2	జలపుష్ప భవనము (హోల్‌సేల్ చేపల మార్కెట్టు)	50,000	50,000
3	క్వారీ మార్కెట్టు	35,000	35,000
4	ఎం.ఎ. మార్కెట్టు	1,00,000	1,00,000
5	అరటిపండ్ల మార్కెట్టు	5,00,000	5,00,000

ఆసక్తి గలవారు ది. 20-11-2023వ తేది సాయంత్రం గం॥ 4.00 ల లోపు నగరపాలక సంస్థ ట్రజరీలో రూ. 200/-లు చెల్లించిన రశీదు, ధరావత్తు సొమ్ము (కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున) డిమాండ్ డ్రాఫ్ట్ మరియు నిర్దేశించిన సొమ్ముకు బ్యాంకు గ్యారంటీ సమర్పించి టెండరు షెడ్యూల్ పొందవచ్చును. ఏ కారణము తెలుపకయే టెండర్లు గాని, వేలము గాని వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు నగరపాలక సంస్థ కమిషనరు వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవెన్యూ ఆఫీసరు-1 గారిని సంప్రదించవచ్చును.

షరతులు:

1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫొటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు ఆథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి ఆథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫొటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. లేనిచో పాటదారులు మాత్రమే వేలములో పాల్గొనవలెను. ఇతరులు ఎవ్వరికీ అనుమతి లేదు.
2) టెండరు దాఖలు చేసిన వారు మాత్రమే వేలమునకు అనుమతించబడును.
3) వేలం ఖాయపరచిన తదుపరి గుత్తదారుడు 3 పోస్టుడేటెడ్ చెక్కులు సమర్పించవలెను.
4) వేలం ఖాయపరిచిన 7 రోజులలో గుత్తదారుడు తమ స్వంత ఖర్చులతో లీజు కాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను. లేనిచో గుత్తేదారుని దరావత్తు జమచేసుకొని లీజు రద్దు చేయబడును.
5) పై షరతులకు లోబడి బ్యాంకు గ్యారంటీ, లీజుకాలము రిజిస్ట్రేషన్ మరియు 6 నెలల అడ్వాన్సు సమర్పించిన తరువాత మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును.
6) పాట మరియు ఛార్జీల మొత్తమునకు జి.ఎస్.టి. 18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారము)
7) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్నవారు మరియు నగరపాలక సంస్థకు ఏవిధమైన బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు.

సం/- **కె.దినేష్‌కుమార్,** ఐ.ఎ.ఎస్.,
కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం